

వీడిన హత్యకేసు మిస్టరీ

మదనపల్లెలో సంచలనం సృష్టించిన అధ్యాపకురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. కుటుంబ కలహాలతోనే హత్య జరిగినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ తెలిపారు. -8లో



రాణించిన సెంట్రల్ జోన్ జట్టు

కడప నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్ జట్టు 52 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.0/25.1

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 25.1– 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 16.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సెమిస్టర్ ఫలితాలు విడుదల

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బీఏ, బీకాం విద్యార్థులకు సంబంధించిన 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి 94.4 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫలితాలు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారులు జె. వెంకటలక్ష్మి, డా. పి. రామకృష్ణ, టి. మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్'ను సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్: డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. హై రిస్క్ గర్భిణులు, తల్లీబిడ్డల సంరక్షణ కోసం 2022 ఏప్రిల్ 1వ తేదీన ప్రారంభించిందని పేర్కొన్నారు. ఈ వాహనాలు జిల్లా వ్యాప్తంగా 19 ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వాహనాల వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

'అంబేడ్కర్' ప్రవేశాల గడువు పొడిగింపు

వైవీయూ: డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ)కు సంబంధించి ప్రథమ సంవత్సరం ప్రవేశాలు పొందేందుకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అంబేడ్కర్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎం. వీరభద్రయ్య తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, డిప్లొమా తదితర కోర్సులు పూర్తి చేసినవారు ప్రవేశాలకు అర్హులన్నారు. అదే విధంగా రెండో, మూడో సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు సైతం ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

6న జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఈనెల 6వ తేదీ ఆదివారం ఉదయం జిల్లాస్థాయి సీనియర్ విభాగం హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. చిన్నపరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

6న ఫుట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఈనెల 6వ తేదీన జిల్లాస్థాయి జూనియర్స్, అండర్–20, సీనియర్స్ విభాగం ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వైఎస్‌ఆర్ కడప జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగం ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1 నుంచి 2009 డిసెంబర్ 31వ తేదీ మధ్యలో పుట్టినవారు అర్హులన్నారు. అండర్–20 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2005 జనవరి 1 నుంచి 2007 డిసెంబర్ 31వ తేదీ లోపు పుట్టినవారు అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ, పుట్టినతేదీ ధృవీకరణపత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

ఆంధ్రప్రగతి రైతు సేవ సహకార సంఘానికి అవార్డు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండల పరిధిలోని ఆంధ్రప్రగతి రైతు సేవ సహకార సంఘానికి జిల్లాలోనే ఉత్తమ సొసైటీ అవార్డు లభించింది. శుక్రవారం విజయవాడలో ఆప్కాబ్ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి చేతుల మీదుగా అవార్డును సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సీఈఓ రాజశేఖర్ అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1975లో స్థాపించిన సంఘం మండల పరిధిలోని రైతులకు సేవలందిస్తోందన్నారు.ఇందులో 2450 మంది సభ్యులు ఉన్నారన్నారు.

స్టార్ మిస్ టీన్ ఇండియాగా రాజంపేట అమ్మాయి



ధనూష సాయి దుర్గాచౌదరి

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన వక్కల గడ్డ విష్ణు చౌదరి, ఉత్తరల కుమార్తె ధనూషసాయి దుర్గా చౌదరి స్టార్ మిస్ టీన్ ఇండియాగా ఇంటెలిజెంట్ 2023కు విజేతగా నిలిచింది. ధనూష సాయి దుర్గాచౌదరి(15) విజయవాడ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రాజస్థాన్‌లో జరిగిన స్టార్ మిస్ టీన్ ఇండియా ఇంటెలిజెంట్‌లో పలు రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఎంతో మందిని దుర్గా ఓడించింది.

కల సాకారమైన వేళ



నా పేరు బచ్చు శ్యామల. రాజుపాళెం మండలం గాదెగూడురు.గతంలో మాకు మట్టిమిద్దె ఉండేది. వర్షం వస్తే అవస్థలు పడాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక కొత్త ఇళ్లు మంజూరైంది.నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం కూడా చేశాం. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నివాసం ఉంటున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.



నా పేరు బత్తలసుబ్బలక్ష్మిదేవి. 20 ఏళ్లుగా బద్వేలు పట్టణంలోని కుమ్మరికొట్టాలులో నివసిస్తున్నాం. మేము చాలా ఏళ్లుగా పక్కా గృహం కావాలని కార్యాలయాల చుట్టూ తిరిగాం. అయినా ఎవరూ స్పందించలేదు. జగనన్న ప్రభుత్వంలో మాకు గుంతపల్లె లేఅవుట్‌లో స్థలం కేటాయించిఇంటిని మంజూరు చేశారు. ఇంటిని పూర్తి చేసుకుని అందులోనే కాపురం ఉంటున్నాము. సొంతింటి కలను నెరవేర్చిన జగనన్నను జీవితాంతం గుర్తుంచుకుంటాం.



జగనన్న కాలనీలో పూర్తయిన గృహం

- పేదలకు గృహయోగం
- జిల్లాలో వేగంగా ఇళ్ల నిర్మాణాలు

కడప సిటీ: టీడీపీ ప్రభుత్వం పేద ఇళ్ల నిర్మాణాలను గాలికి వదిలేసింది. పైకి అభివృద్ధి చేస్తున్నట్లు నటిస్తూనే పేదల సంక్షేమానికి తూట్లు పొడిచింది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి కాలనీల ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గూడులేని నిరుపేదలకు నీడ కల్పించేందుకు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలో 452 లే అవుట్లలో, వివిధ ప్రాంతాల్లో 97,870 జగనన్న ఇళ్లను మంజూరు చేశారు. ప్రస్తుతం 25,354 గృహాల నిర్మాణం పూర్తి కాగా, ఇప్పటివరకు రూ.929 కోట్లు ఖర్చు చేశారు. పట్టణ ప్రాంతాల్లో సెంటు స్థలంలో, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు స్థలంలో ఇల్లు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకుగాను రూ. 1,80,000లను ఒక్కొక్క ఇంటికి మంజూరు చేశారు. అంతేకాకుండా స్వయం సహాయక మహిళలకు మెప్మా ద్వారా రూ.30 వేలు ఆయా బ్యాంకుల్లో పావలా వడ్డీకి రుణాలు ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. లక్షా 80 వేల రూపాయలను లబ్ధిదారులు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వమే ఈ ఖర్చు భరిస్తుంది.



జిల్లాకు మంజూరైన జగనన్న ఇల్లు : 97,870
పూర్తయినవి : 25,354
లే అవుట్లు : 452
ఖర్చు చేసిన మొత్తం: రూ. 929 కోట్లు
అడ్వాన్స్ కింద రూ. 20 వేలు



- జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 452 లే అవుట్లలో మొత్తం 97,870 ఇళ్లు మంజూరయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు 25,354 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటికే కొంతమంది లబ్ధిదారులు నిర్మించిన ఇళ్లల్లో గృహ ప్రవేశాలు కూడా చేసి నివాసం ఉంటున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం అందిస్తోంది. అర్బన్ ప్రాంతాల్లో సెంటు స్థలంలో, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు స్థలంలో ఇల్లు కట్టుకునేలా స్థలాలు మంజూరు చేశారు. ఇందుకుగాను బేస్‌మెంట్‌కు రూ.60 వేలు, గోడలకు రూ.60 వేలు, శ్లాబ్‌కు రూ.30 వేలు, మొత్తం రూ. 1.80 లక్షలు అందజేస్తారు. ఇది కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు మెప్మా ద్వారా మరో రూ. 30 వేలు రుణంగా తీసుకునే సదుపాయం కల్పించారు. కేవలం ఈ మొత్తాన్ని మాత్రమే లబ్ధిదా రులు చెల్లించాల్సి ఉంటుంది. మిగతా లక్షా 80 వేలను చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే భరిస్తుంది.

93,470 ఇళ్లకు రిజిస్ట్రేషన్

ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకం కింద మహిళల పేరిట సర్వహక్కులు కల్పిస్తోంది. గతంలో హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణాన్ని చెల్లించాల్సి ఉన్నా పూర్తి హక్కులు ఉండేవి కావు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మహిళల పేరిట ఇంటి మీద సర్వహక్కులు కల్పిస్తోంది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని కల్పించింది. ఇప్పటివరకు జిల్లాలో 97,870 గృహాలు మంజూరు కాగా, ప్రస్తుతం 93,470 ఇళ్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. రూరల్ ప్రాంతాల్లో అయితే రూ.10 వేలు, మున్సిపాలిటీల్లో రూ.15 వేలు, నగర పాలక సంస్థలో ఉన్న ఇళ్లకు రూ.20 వేలు రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించి అందుబాటులో ఉన్న సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసేలా సౌకర్యం కల్పించారు. ఈ ప్రయోజనం వల్ల అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకుల్లో ఇంటిని తనఖా పెట్టి రుణ సదుపాయం పొందేందుకు వీలుంటుంది.

- జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతోపాటు రాజంపేట నియోజకవర్గంలోని సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల పరిధిలో మొత్తం 452 లే అవుట్లను నిర్మించి ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. బద్వేలులో 69 లే అవుట్లు, జమ్మలమడుగు 81, కడప 16, కమలాపురం 48, మైదుకూరు 62, ప్రొద్దుటూరు 36, పులివెందుల 102, రాజంపేట 33 లే అవుట్లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లే అవుట్లతో కలిపి మొత్తం 452 లే అవుట్లలో జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారు.

అడ్వాన్స్ కింద రూ. 20 వేలు

ఆర్థిక స్థోమత లేని, వివిధ కారణాలతో జగనన్న ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా నిలిచిపోయిన గృహ నిర్మాణాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. అడ్వాన్స్ పేరిట రూ. 20 వేలను అందిస్తోంది. లబ్ధిదారులు ఏ దశలో ఇళ్ల నిర్మాణం నిలిపి వేశారో గుర్తించి ఆ దశను బట్టి రూ. 20 వేల వరకు అడ్వాన్స్ ఇస్తారు. ఇప్పటివరకు 23,956 మందికి మొత్తం రూ. 46.4 కోట్లు అడ్వాన్స్ కింద లబ్ధిదారులకు ప్రభుత్వం చెల్లించింది. ఈ అడ్వాన్స్‌పోను మిగతా మొత్తాన్ని వారికి అందజేస్తారు.

పనులు వేగవంతం



జిల్లాలోని ఆయా లే అవుట్లలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. లబ్ధిదారులకు అన్ని విధాలా ప్రభుత్వం సహకరిస్తోంది. మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు వేగవంతం చేశాం. ఇళ్ల నిర్మాణాలు మరింత పురోగతి సాధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. – కృష్ణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, గృహ నిర్మాణశాఖ, కడప

ఎయిర్‌పోర్టులో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న పోలీసు, ఆక్టోపస్ అధికారులు, సిబ్బంది

వల్లూరు: జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు వల్లూరు ఎస్‌ఐ పెద్ద ఓబన్న ఆధ్వర్యంలో ఆక్టోపస్ ఫోర్స్, సిబ్బంది కడప ఎయిర్‌పోర్ట్‌లో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్‌కు వీవీపీల రాక పోకల సమయంలో టెర్రరిస్ట్‌లు బంధిస్తే వారిని ఏ విధంగా రక్షించాలి అనే అంశంపై మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్ఎస్ఎస్ కృష్ణారావు, ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రామచంద్ర మూర్తి, డీఎస్పీ సాయి శ్రీనివాస్, ఆర్‌ఐలు శివాజీ, గోపీ చంద్ నాయక్, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కమార్, ఎస్పీఎఫ్ డీఎస్పీ రాజు, ఇన్‌స్పెక్టర్ యూసఫ్, ఏఆర్ ఆర్‌ఐ శివరాముడు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు బోగీలో పొగలు



రెడ్డిపల్లి సమీపంలో ఆగిన మధురై ఎక్స్‌ప్రెస్ రైలు

పుల్లంపేట: చెన్నై నుంచి మధురైకు బయలు దేరిన మధురై ఎక్స్‌ప్రెస్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లి సమీపంలోకి రాగానే జనరల్ బోగీలో పొగలు వచ్చాయి. డ్రైవర్ అప్రమత్తమై రైలును నిలిపేశాడు. దీంతో సుమారు అరగంట పాటు రైలు ఆగింది. ప్రయాణికులు కిందకు దిగారు. బ్రేకులు అరిగిపోవడం వల్ల రాపిడికి గురై కింద మంటలు చెలరేగి..బోగీలో పొగ వచ్చిందని డ్రైవర్ తెలిపాడు. త్రుటిలో ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ పరిశీలించిన అనంతరం రైలు యథావిధిగా కొనసాగింది.

సీఎం సహకారంతో ఆలయాలకు పూర్వవైభవం

ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్

కడప కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు పూర్వవైభవం చేకూరుతోందని దేవదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం మున్సిపల్ మైదానంలో శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయం సమావేశ మందిరంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (సీత) పేరిట వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో దేవాలయాల చైర్మన్లు, పాకల మండలి సభ్యులు, ఈఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు దేవాలయాల్లోని సమస్యల గురించి తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా అర్చకులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, అర్చకత్వంలో అన్ని కులాల వారికి అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. ప్రధానంగా భక్తులకు వసతి కల్పించడానికే ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. దేవాలయాల అభివృద్ధిలో చైర్మన్లదే కీలక పాత్ర అని, ఆలయానికి సేవలందించే అవకాశం పూర్వ జన్మ సుకృతమన్నారు. తమ ఆలయాల గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమాల గురించి బాగా ప్రచారం చేయాలని, రోజు భజన లాంటివి ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండాలని సూచించారు. 'సీత' ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ దేవాలయాలలో చైర్మన్, ఈఓలు ప్రాపర్టీ రిజిస్టర్లను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా అర్చక, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని.. దీనిని సద్వినియోగం చేసుకుని చైర్మన్లు, అర్చకులు ఆలయా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్ భట్టార్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధిలో చైర్మన్లు, అర్చకులదే కీలక పాత్ర అన్నారు. శ్రీరాజరాజేశ్వరి ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణశర్మ, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్, ఉభయ జిల్లాల దేవాలయాల అర్చకులు, చైర్మన్లు, ధర్మకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ఆంధ్రాకు ప్రత్యేకస్థానం

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–23 ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత మెగా టోర్నమెంట్‌కు కడప వేదికగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. బ్యాడ్మింటన్ క్రీడలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నేషనల్ గేమ్స్‌కు వెళ్లే ఆంధ్రా జట్టును ఈ టోర్నమెంట్ నుంచి ఎంపిక చేయనుండటం శుభపరిణామమన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ఎం. ద్వారకనాథ్ మాట్లాడుతూ కడప నగరంలో మరో చక్కటి స్టేడియం అందుబాటులోకి రావడం బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానీబాషా, అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి సైతం బ్యాడ్మింటన్ రాకెట్ చేతబట్టి కొద్దిసేపు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం మెయిన్ డ్రా మ్యాచ్‌లు నిర్వహించారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి నాగరాజు, నెల్లూరు జిల్లా కార్యదర్శి వెంకట్, కర్నూలు కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూజారికి వరం

- ఆలయ ఉద్యోగులకు విరమణ వయస్సు 62ఏళ్లకు పెంపు
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్చకులు, ఉద్యోగులు





కడప కల్చరల్ : ఆలయాల్లో అర్చకులపై వైఎస్ జగన్ ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయస్సు 60నుంచి 62ఏళ్లకు పెంచినట్లుగానే దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా గరిష్ట వయస్సు 62కి పెంచుతూ నిర్ణయాన్ని ఆమోదించింది. దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులు ఓపిక, శక్తి ఉన్నంతవరకు భగవంతుడి సేవలో కొనసాగేలా ప్రభుత్వం చారిత్రాత్మకత నిర్ణయానికి ఆమోదం తెలిపింది. ఈ రెండు నిర్ణయాలపై దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

200 మందికిపైగా లబ్ధి: జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలోని 3200 ఆలయాలు, అందులో దేవాదాయ శాఖ పరిధిలోని ఈఓ కింద 185 ఆలయాలు ఉన్నాయి. ఇందులో 200మందికిపైగా అర్చకులు విధులు నిర్వహిస్తున్నారు. అర్చకులకు ఓపిక, శక్తి ఉన్నంతవరకు అర్చకత్వం చేసుకునే అవకాశం దక్కింది. ఆలయాలలో సిబ్బందికి ఇప్పటికే పదవీ విరమణ వయస్సు పెంపు రావడంతో ఆయా వర్గాలు సంతోషంగా ఉన్నాయి. తాజా నిర్ణయంతో అర్చకుల్లో కూడా హర్షం వ్యక్తమవుతోంది. త్వరలో మార్గదర్శకాలకు దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం విడుదల చేయనుంది.

జిల్లాలోని ఆలయాల వివరాలు :

గ్రేడ్‌లు	ఆలయాల సంఖ్య
6(ఏ)	7
6(బి)	35
సి–2	1428
6(బి) (సత్రాలు, మఠాలు)	16

మొత్తం ఆలయాలు: 3200
ఈవోల నిర్వహణలో : 185
లబ్ధి పొందనున్న కుటుంబాలు : 200

చరిత్రాత్మక నిర్ణయం



ఆలయాల్లో అనువంశిక హక్కులు కొనసాగించేలా నిర్ణయించడంతోపాటు అర్చకులకు రిటైర్‌మెంటు లేకుండా చట్ట సవరణ చేసేలా నిర్ణయించడం నిజంగా చరిత్రాత్మకమే. దీంతో ఆలయాల్లో దేవుళ్లకు ఆగమ శాస్త్రాల ప్రకారం నిత్యం పూజలు, అర్చనలు చేసే సంప్రదాయం కొనసాగనుంది. ఏదీ ఏమైనా ఇచ్చిన మాట ప్రకారం నిర్ణయాన్ని అమలు చేయడం గొప్ప విషయం. ఆయనకు భగవంతువవి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయి.
– శంకర బాలాజీ(దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్), కడప

సీఎం నిర్ణయం సాహసోపేతం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణలు అర్చకుల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయం నిజంగా సాహసోపేతం, వంశపారంపర్య హక్కు పునరుద్ధరణతో అర్చక వ్యవస్థకు భవిష్యత్‌లో యువత నుంచి ప్రోత్సాహం ఉంటుంది. సీఎంకు కృతజ్ఞతలు.
– విజయ్ బట్టార్(అర్చక సమాఖ్య అధ్యక్షుడు), కడప

ఆలయ వ్యవస్థ అభివృద్ధికి దోహదం



అర్చకుల పదవీ విరమణ వయస్సు పెంపు, వంశపారంపర్య హక్కుల పునరుద్ధరణ తదితర ప్రభుత్వ నిర్ణయాలు, జిల్లాలో దేవాలయాల వ్యవస్థ అభివృద్ధికి దోహదపడనున్నాయి. అర్చకులలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.
– శశిధర్(అర్చకులు), కడప

పాలకులు బాగుంటేనే రాజ్యం సుభిక్షం



వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

రైల్వేకోడూరు: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వర్షాలు పడక కరువు తాండవించేందని, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినాటి నుంచి వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయన్నారు. పాలకులు బాగుంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందనే దానికి ఇంతకన్నా నిదర్శనం ఏమి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సలహాదారులు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యానకళాశాలను జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ సి.హెచ్.రూత్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ ఉద్యానకళాశాల అన్నమయ్య జిల్లాకు తలమానికంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలోని దోస, మామిడి, చీని, ఔషధ మొక్కలు, నర్సరీలను పరిశీలించారు. రైల్వేకోడూరు ఉద్యాన పంటలకు ప్రసిద్ధిగాంచిందని, మరో కోనసీమగా వెలుగొందుతోందన్నారు. . అనంతరం కోడూరు పట్టణంలోని అగ్రిల్యాబ్‌ను, ఆర్బీకేలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, సీనియర్ శాస్త్రవేత్త స్వరాజ్యలక్ష్మి , ఉద్యానశాఖ అధికారి ఆషియా, కోడూరు ఉప సర్పంచ్ తోట సాయి, డైరెక్టర్ ప్రశాంతి రమేష్, ఆర్.వి.రమణ, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, సుబ్రమణ్యం, చంద్ర పాల్గొన్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం


లత (ఫైల్)


నిహిత్ (ఫైల్)


హనిష్ (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని తాడిగొట్ల దళితవాడకు చెందిన ముగ్గురు అదృశ్యం అయినట్లు ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు. సొంట లత(27) తన పిల్లలు నిహిత్(5), హనీష్(1)ను తీసుకుని గురువారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయారన్నారు. వీరు తిరిగి రాక పోవడంతో లత భర్త అశోక్‌తోపాటు, ఆమె తల్లి దండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఓబులవారిపల్లె : పుల్లంపేట మండల పరిధిలోని సీతారాంపేట జాతీయ రహదారిపై ఆటోను లారీ ఢీకొనడంతో యువతి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. రాజంపేట మండలం బోయనపల్లె నుంచి పి.రవళి(28), భర్త నరసింహులు, బంధువులు హరికృష్ణ, మహేంద్రలతో కలిసి ఆటోలో ఓబులవారిపల్లె మండలం గొబ్బూరువారిపల్లి గ్రామానికి బయలుదేరారు. సీతారాంపేట వద్దకు రాగానే ఆటోను లారీ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ రవళిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది.

వీడిన హత్యకేసు మిస్టరీ

- కుటుంబ కలహాలతోనే అధ్యాపకురాలి హత్య
- ముగ్గురు హంతకుల అరెస్ట్
- ఎస్పీ గంగాధరరావు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన అధ్యాపకురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. భర్త, అతడి ఇద్దరి భార్యల మధ్య తగాదాలు, కుటుంబ కలహాలతోనే లెక్చరర్ రుక్సానా హత్య జరిగినట్లు ఎస్పీ గంగాధరరావు వెల్లడించారు. హత్య చేసిన హంతకుల్లో రుక్సానా భర్త ఖదీర్‌అహ్మద్ రెండో భార్య ఆయిషా ఇద్దరు తమ్ముళ్లు, వారి స్నేహితుడిగా నిర్ధారించారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప, సీఐ మురళీకృష్ణతో కలిసి ఎస్పీ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన ఎస్.కే.ఖాదర్ అహమ్మద్ కుమారుడు ఖదీర్ విద్యుత్ సంస్థలో డ్యూటీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. 2022 మార్చి 29న పట్టణంలోని వెంకటేశ్వరపురానికి చెందిన గౌస్‌పీర్ కుమార్తె ఆయిషాను పెళ్లి చేసుకున్నాడు. అయితే ఖదీర్‌కు అప్పటికే మదనపల్లె మండలం బీకే.పల్లె పంచాయతీ వైఎస్సార్ కాలనీకి చెందిన మహమ్మద్ అలీ కుమార్తె రుక్సానాతో 2017లో పెళ్లి జరిగింది. ఈ విషయాన్ని దాచిపెట్టి ఖదీర్.. అయిషాను వివాహం చేసుకోవడంతో, తనను మోసం చేశారంటూ భర్త, అతడి మొదటిభార్య రుక్సానా, వారి కుటుంబ సభ్యులపైన టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయిషా ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆయిషా పుట్టింటిలో ఒంటరిగా ఉండటం, భర్తకు తమ చెల్లెలు దూరంగా ఉండటాన్ని భరించలేక ఆమె, ఇద్దరు అన్నదమ్ములు షేక్‌ప్యారేజాన్, సులేమాన్, వీరి స్నేహితుడు షేక్ అహ్మద్‌లు మొదటి భార్య రుక్సానాను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కత్తులను కొనుగోలు చేసి, రుక్సానా కదలికలపై నిఘా ఉంచి పలుమార్లు రెక్కీ నిర్వహించారు. రుక్సానా పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పని చేస్తుండటం, ప్రతిరోజు ఉదయం కళాశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వెళుతుందన్న విషయాన్ని తెలుసుకున్నారు. కళాశాల నుంచి ఇంటికి వెళ్లే ప్రశాంత్‌నగర్‌లోని సిద్ధార్థకాలేజీ వీధి తమ పథకానికి అనుకూలంగా ఉంటుందని భావించి సాయంత్రం 5.10 గంటల సమయంలో కాపుకాశారు. ఆయిషా తమ్ముడు సులేమాన్, అతని స్నేహితుడు షేక్ అహ్మద్‌లు ఇంటికి వెళుతున్న ఆయిషాను అడ్డగించి, కళ్లలో కారం చల్లి.. ఆమె మెడపైన కత్తితో పలుమార్లు క్రూరంగా పొడిచి చంపారు. తర్వాత తాము వచ్చినటువంటి మోటార్‌సైకిల్‌లో పారిపోయేందుకు ప్రయత్నించగా, అది స్టార్ట్ కాకపోవడంతో దానిని అక్కడే వదిలేసి పారిపోయారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నేరస్థలంలో సీసీ ఫుటేజీ, హంతకులు వదిలేసి వెళ్లిన వాహనం, సాంకేతికత సహాయంతో పట్టణంలోని మూడుస్టేషన్ల సీఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. శుక్రవారం ఉదయం పోలీసులకు వచ్చిన రహస్య సమాచారం మేరకు టమాటా మార్కెట్ వెనుకవైపున నిందితులను అరెస్ట్ చేశారు. నేరంలో ఉపయోగించిన రెండు కత్తులు, ఒక మోటార్‌సైకిల్, రక్తపుమరకలు కలిగిన రెండుచొక్కాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు పాత నేరస్తులుగా ఉన్నారు. కేసు విషయమై సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నామని, నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసు విచారణలో ఇంకా ఎవరైనా నిందితుల ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిని అరెస్ట్ చేస్తామన్నారు.

రాణించిన సెంట్రల్ జోన్ జట్టు


క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న సౌత్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ జోన్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 38.3 ఓవర్లలో 154 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నయీముల్లా 31 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ బౌలర్లు ఆదిత్యారెడ్డి 4, గీత్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.కె.మహమ్మద్ తౌఫిక్ 62, అభినవ్ 53 పరుగులు చేశారు. సౌత్‌జోన్ బౌలర్లు సాయిఆర్థిత్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్‌జోన్ జట్టు 52 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.


తౌఫిక్, (62 పరుగులు)


ఆదిత్యారెడ్డి, (4 వికెట్లు)

వివాహం కాలేదని యువకుడి ఆత్మహత్య

కడప అర్బన్ : తనకు వివాహం కాలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధి ఓంశాంతి నగర్‌లోని రోడ్ నంబర్ 2లో బండి రఘునాథ్‌రెడ్డి (34) నివసించే వాడు. ఆయన తల్లి లక్ష్మీదేవికి కంటిచూపు సరిగా లేదు. మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. తండ్రి రామసుబ్బారెడ్డి తన స్నేహితుడి వద్ద వుంటున్నాడు. వీరు సిద్దవటం మండలం వంతాటిపల్లె నుంచి కడపకు వచ్చి వుంటున్నారు. ఈక్రమంలో ఈ నెల 3వ తేదీన ఇంటిలో తన తల్లికి భోజనం పెట్టాడు. తరువాత తాను హాల్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలం పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుని తండ్రి రామసుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత


లారీ, బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్ : చెన్నూరు మండలం గోపవరం–చెన్నూరు రోడ్డులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి, అదనపు ఎస్పీ షేక్ మాసుంబాష ఆదేశాల మేరకు శుక్రవారం దాడులు నిర్వహించారు. చిలమకూరి పాపయ్యగారి షెడ్డు వద్ద లారీలో రేషన్ బియ్యం అక్రమంగా లోడ్ చేసి రవాణాకు సిద్ధంగా వుందనే సమాచారంతో తనిఖీలు చేశారు. ఆ లారీలో వివిధ రంగుల్లో వున్న ప్లాస్టిక్ సంచులలో గల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. మొత్తం 415 బస్తాల బియ్యం, బొలేరో వాహనం, లారీని సీజ్ చేశారు. బొలెరో వాహనం ద్వారా చెన్నూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి సేకరించి అక్రమంగా రవాణా చేయుటకు సహకరిస్తున్నారు. బొలేరో, లారీతో పాటు రేషన్ బియ్యం మొత్తం విలువ సుమారు రూ.21,43,280 ఉంటుంది. వీటిని స్వాధీనం చేసుకున్నారు. చెన్నూరుకు చెందిన లారీ డ్రైవర్ బ్రహ్మయ్య, లారీ క్లీనర్ కొట్బాల నూర్‌బాష, బొలెరో డ్రైవర్ కొండు రామకృష్ణలను అరెస్ట్ చేశారు. లారీ ఓనర్ ప్రొద్దుటూరుకు చెందిన మహబూబ్‌బాషాతో పాటు, పై ముగ్గురిపై చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులైన ఇన్‌స్పెక్టర్ జి.ఈదురుబాష, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ.బాలగంగాధర్‌రెడ్డి, కడప సిఎస్‌డిటి పి.ఎం.వి మనోజ్, ఉప్పరపల్లి విఆర్‌ఓ పి.వెంకట సుబ్బయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎస్.జనార్ధన్‌రావు, కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, రంతుబాషలు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి వాసికి ఏపీఎన్ఆర్‌టీఎస్ సాయం


రాజేష్‌కు ఔట్ పాస్‌పోర్టు అందిస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ నరసారెడ్డి

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్‌టీఎస్) సభ్యుల సాయం వల్ల పశ్చిమగోదావరి జిల్లా వాసి అనిపి రాజేష్ ఎలాంటి సమస్యలు లేకుండా ఇండియాకు వచ్చాడు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం జల్లి కాకినాడకు చెందిన రాజేష్ నాలుగేళ్ల క్రితం జీవనోపాధి కోసం డ్రైవర్ పని నిమిత్తం కువైట్ వెళ్లాడు. కువైటీ(స్పాన్సర్) డ్రైవర్ పని ఇవ్వకుండా ఏడారి ప్రాంతంలోని వ్యవసాయ కేంద్రంలో కూలి పని చేయించుకుంటూ వచ్చాడు. రెండేళ్ల క్రితం కువైటీ కారును అతనికి తెలియకుండా నడిపి యాక్సిడెంట్ చేశాడు. దీంతో గాయలపాలై రెండునెలలకు పైగా ఆసుపత్రిలో ఉన్నాడు. ఆసుపత్రి నుంచి డిశార్చి కాగానే అతన్ని ఇంట్లో బాయ్‌గా నియమించుకొని ఎక్కువ పని చేయిస్తూ వేధించేవాడు. కొద్ది రోజుల తర్వాత కొడుతూ, తిడుతూ ఉంటే ఆ బాధలు భరించలేక ఇంట్లో నుంచి పారిపోయాడు. పాస్‌పోర్టు కువైటీ వద్దనే ఉంచుకోవడం వల్ల ఆకామా(రెసిడెన్సి) కూడా లేకుండా పోయింది. పోలీస్ చెకింగ్ ఎక్కువగా ఉండటం వల్ల పట్టుబడితే కేసు పెట్టి జైల్లో వేస్తారని భావించి, ఏపీఎన్ఆర్‌టీఎస్‌ను ఆశ్రయించాడు. ఆ సంస్థ రీజనల్ కో ఆర్డినేటర్ ఎంవీ నరసారెడ్డిని కలిసి తన కష్టాలు చెప్పి ఇండియాకు పంపేందుకు సాయపడాలని అభ్యర్థించారు. ఆయన వెంటనే స్పందించి సామాజిక కార్యకర్త రెడ్డెయ్యరెడ్డితో కలిసి భారత రాయబార అధికారులతో మాట్లాడి ఔట్ పాస్‌పోర్టు తయారు చేయించి ఈనెల 2వ తేదీ సురక్షితంగా వారి స్వస్థలానికి పంపించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రుల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, భారత రాయబార అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి, ఎంవీ నరసారెడ్డి, రెడ్డెయ్యరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ సాగు పెరగాలి


మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సాధికార సంస్థ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ రాజేశ్వర్

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయ సాగును విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని రైతు సాధికార సంస్థ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ రాజేశ్వర్ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం వల్ల ఖర్చులు తగ్గి అధిక దిగుబడులను సాధించవచ్చని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కడప నగరంలోని జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో రెండవ రోజైన శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆగస్టు నెల కార్యాచరణపై సమావేశం జరిగింది. ముద్దనూరు, సింహాద్రిపురం, కొండాపురం, తొండూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పెద్దముడియం, ముద్దనూరు, రాజుపాళెం, దువ్వూరు, మైదుకూరు, చాపాడు, కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె, ఎర్రగుంట్ల మండలాల సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఏ గ్రేడ్ మోడల్, ఏటియం మోడల్, వరి మోడల్ చేయడం వలన కలిగే ఉపయోగాల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. పొలంబడి ఏ విధంగా చేయాలి, చేయడం వలన రైతులకు కలిగే ఉపయోగాల గురించి శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని తెలిపారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ప్రకృతి వ్యవసాయ సాగుపై సూచనలు, సలహాలను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డీపీఎంయూ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ జారి పడి..

ముద్దనూరు : స్థానిక రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడిన యువకుడు మృతి చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ రారాజు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా పామిడి గ్రామానికి చెందిన అల్లాబకాష్(32) పెయింటింగ్ పని నిమిత్తం ముద్దనూరుకు వచ్చి తిరిగి పామిడికి బయలుదేరారు. గురువారం రాత్రి ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు ప్రయాణించడానికి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతను ఎడమ కాలు, కుడి చేయి తెగిపోయి తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రున్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

కేరళ లారీ డ్రైవర్ మృతి

కమలాపురం : కేరళ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ మహమ్మద్ అజీమ్(50) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని భారతి పరిశ్రమలో సిమెంట్ లోడింగ్‌కు కేరళ నుంచి వచ్చిన లారీ డ్రైవర్ యార్డులో ఉండగా గుండెలో నొప్పి ఉందని తోటి డ్రైవర్లకు చెప్పాడు. వారు అతడిని చికిత్స నిమిత్తం కమలాపురం సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా పోలీసులు విచారించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశామని, వారు వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స


మహిళ కడుపులో నుంచి తొలగించిన కణితి

కడప అర్బన్ : జిల్లాలోని జమ్మలమడుగుకు చెందిన ఓ మహిళ (65) తీవ్రమైన కడుపునొప్పితో రిమ్స్‌లో వైద్యులను సంప్రదించింది. ప్రాథమిక పరీక్షల్లో పేగుల సమీపంలో పెద్ద కణితి వుందని నిర్ధారించారు. ఆమెకు శనివారం శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించారు. అండాశయంలో సుమారు ఒకటిన్నర కిలోల గడ్డ మెలితిరిగి వుండడం గమనించారు. శస్త్ర చికిత్స నిపుణులు నేర్పుగా దాన్ని తొలగించారు. ఈ చికిత్సలో కడప రిమ్స్ హెచ్‌ఓడీ డాక్టర్ వాణి, డాక్టర్ అమానుల్లా, డాక్టర్ లోకేష్, డాక్టర్ విజయ్‌లు పాల్గొన్నారు. వీరికి సహాయంగా అనస్తీషియా విభాగం నుంచి డాక్టర్ ప్రవీణ, డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌కుమార్

రాయచోటి అర్బన్ : దళిత కుటుంబానికి న్యాయం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుధీర్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన రాయచోటిలో కలెక్టర్ గిరీషా పీఎస్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్రంకొండ పంచాయతీలోని పాత ఇందిరమ్మ కాలనీకి చెందిన దళితుడు బుడ్లపల్లె కదిరయ్యకు 1971లో అప్పటి ప్రభుత్వం సర్వేనంబర్ 522/3లో 1.4 సెంట్ల డీకేటీ భూమిని మంజూరు చేసిందన్నారు. అయితే అదే పంచాయతీకి చెందిన రహంతుల్లా కుటుంబీకులు.. కదిరయ్యను సదరు భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటూ దౌర్జన్యం చేశారన్నారు. అనంతరం కదిరయ్య మనువడు రెడ్డెయ్యను సైతం భూమిలోకి రానివ్వకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ విషయంపై కదిరయ్య కుటుంబం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కావున మీరైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

గాలివీడు మండలంలో కేంద్ర బృందం

గాలివీడు : స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ కింద ఎంపికైన మండలంలోని గరుగుపల్లె, ఎగువగొట్టివీడు గ్రామ పంచాయతీలలో శుక్రవారం కేంద్రం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ క్లినిక్, మసీదు, దేవాలయం, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయా, వాటిని ఉపయోగిస్తున్నారా లేదా.. మల,మూత్రశాలకు పోయి వచ్చిన తరువాత చేతులు శుభ్రం చేయుటకు సబ్బు లేక హ్యాండ్ వాష్‌ను వాడుతున్నారా లేదా అని పరిశీలించారు. పరిశుభ్రతను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేంద్రం బృందం సభ్యులు చెన్నకేశవరెడ్డి, సుశాంత్, ఎంపీడీఓ శేఖర్‌నాయక్, సర్పంచ్‌లు మల్లికార్జుననాయుడు, జానికి రామాంజులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ అడ్వైజర్‌గా లక్ష్మీనారాయణ



రాజంపేట : మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, నీతి అయోగ్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా (గుర్తింపు పొందిన) ఏర్పడిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ శాఖకు చీఫ్ లీగల్ అడ్వైజర్‌గా రాజంపేటకు చెందిన తరిగోపుల లక్ష్మీనారాయణను ఎన్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ నియామకం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం లక్ష్మీ నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడడం.. నేరాలు, హింస, అవినీతికి వ్యతిరేకంగా పోరాడడమే కాకఅలా చేసిన వారి మీద చర్యలు తీసుకోవాలని చెప్పవచ్చని తెలిపారు. అవగాహన ఉన్నంత మేర సమాజంలో వీటి వలన జరిగే నష్టాల గురించి ప్రజలకు వివరించి, సమాజ మార్పు కోసం ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.

హుండీల్లో నగదు చోరీ

ములకలచెరువు : స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద ఉన్న శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలోని మూడు హుండీల్లో ఉన్న నగదును గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి చోరీ చేశారు. హుండీలలోని సొమ్ము తీసుకొని, వాటిని ఆలయం వెనకల వైపు పడేశారు. సుమారుగా రూ.15 వేల వరకు నగదు ఉంటుందని ఆలయ ధర్మకర్తలు శుక్రవారం తెలిపారు. ఇప్పటికి రెండుసార్లు హుండీల చోరీ జరిగినట్లు, చోరీలను అదుపుచేయాలని వారు కోరుతున్నారు.

కుక్కపిల్ల అడ్డు రావడంతో..

– ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

గాలివీడు : కుక్క పిల్ల అడ్డురావడంతో.. ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గాలివీడు నుంచి గోరాన్‌చెరువుకు బేల్దారి పని నిమిత్తం కూలీలు ఆటోలో వెళ్తున్నారు. అదే మార్గంలోని గోపనపల్లె వైపు నుంచి గాలివీడుకు ద్విచక్రవాహనం వస్తోంది. మండల కేంద్రంలోని కేకే వాటర్ ప్లాంట్ సమీపంలో రాగానే కుక్కపిల్ల అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించబోయి ఈ రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలానికి చెందిన ఆటో డ్రైవర్ తిమ్మరాజు, గోపనపల్లెకు చెందిన స్కూటరిస్టు షఫీ తీవ్రంగా గాయపడ్డారు. కుక్కపిల్ల అక్కడిక్కడే మృతి చెందింది. స్థానికులు 108కి సమాచారం అందించడంతో బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్కూటరిస్టును మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు.

గాయపడ్డ వ్యక్తి మృతి


వీరయ్య (ఫైల్)

కలికిరి : కలికిరి పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గత నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నడిచి వెళుతున్న జరుగుమల్లి వీరయ్య(47)ను పల్లవోలు గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో వినయ్‌కుమార్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడి కోమా స్థితిలో ఉన్న వీరయ్యను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నెల రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు మృత్యుఒడిలోకి చేరాడు. మృతదేహానికి కలికిరి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య భాగ్యమ్మ, కుమార్తె జీవ జ్యోతి, కుమారుడు లోకేష్ వున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సాహితీవేత్త జరుగుమల్లి వీరయ్య మృతి సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలికిరి ప్రభుత్వాసుత్రికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన మృతి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం త్వరితగతిన అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, సీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, కొటాల వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటపతి తదితరులు ఉన్నారు.